క్లుప్తంగా

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లోకేశ్

మడకశిర: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్‌ఐ లోకేశ్ సూచించారు. సోమవారం ఆయన పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టరీత్యానేరమని, ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జూనియర్లు, సీనియర్లు అన్న భావనతో కాకుండా కలసిమెలసి ఉండాలన్నారు. డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఏఎస్‌ఐ క్రిష్టారెడ్డి, హెచ్‌సీ నాగభూషణ్, ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

గోరంట్ల: మండల పరిధిలోని కళ్లగేరికి చెందిన రైతు గంగిరెడ్డి చెందిన వేరుశనగ గడ్డి వామి ఆదివారం రాత్రి అగ్నికి ఆహుతైంది. 10 బండ్ల వేరుశనగ పశువుల మేతతో పాటు రెండు ట్రాక్టర్ల వరిగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని బాధిత రైతు వాపోయారు. రూ. లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

మడకశిర: పట్టణానికి చెందిన ఓ ఆటో రాజీవ్ గాంధీ సర్కిల్ నుంచి కర్ణాటక ప్రాంతంలోని చంద్రబావి గేట్‌కు సోమవారం వెళుతుండగా మారుతీనగర్ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. త్రుటిలో ప్రాణాపాయం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

పరిగిలో శౌర్య జాగరణ యాత్ర

పరిగి: మండలంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శౌర్య జాగారణ యాత్రలో నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ నేతృత్వంలో తొలుత శాసనకోటలో యాత్రను ప్రారంభించారు. అనంతరం సుబ్బరాయనిపల్లి, కొడిగెనహళ్లి, సేవామందిరం, బిందూనగర్, పెద్దిరెడ్డిపల్లి, గొరవనహళ్లి, మోదా మీదుగా ఆనందపాళ్యం వరకూ యాత్ర సాగింది. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా యాత్ర చేపట్టామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



ఆనందరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేఆర్.ఆనందరెడ్డి (78) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, నాయకులు మధుమతిరెడ్డి, బాలాజీ మనోహర్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఆనందరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అవసరమైన పనులు గుర్తించండి



రొళ్లలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ఆజాద్

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం పీడీఐ (పంచాయతీ అభివృద్ధి సూచిక) పై మండల స్థాయి అధికారులకు ఎంపీడీఓ ఆజాద్, తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను ప్రగతి బాటలో నడిపించడానికి మండల, గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రధానంగా అవసరమైన పనులను గుర్తించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ క్రిష్ణప్ప, మండల, గ్రామ స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం!



- కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు
- చేతల్లో చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- టీడీపీ హయాంలో సొంత పార్టీ నాయకులకే జరగని న్యాయం
- వైఎస్సార్‌సీపీ హయాంలో అందరికీ లబ్ధి

'కులాలను చూడం.. మతాలను చూడం... ఏ రాజకీయ పార్టీకి చెందిన వారో అసలే చూడం... అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు వర్తింపచేస్తాం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నోసార్లు చెప్పారు. చెప్పడమే కాదు ఆచరణలో కూడా దాన్ని చేసి చూపుతున్నారు. మచ్చుకు కొన్ని ఇలా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం

పెనుకొండ: ఇక్కడ కనిపిస్తున్న వృద్ధుని పేరు మాళప్ప. ఈయనది రొద్దం మండల కేంద్రం. ఈయన టీడీపీ కార్యకర్త. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం ఎంతో ప్రయత్నించాడు. అర్హత ఉన్నా పింఛన్ మాత్రం మంజూరు కాలేదు. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎలాంటి సిఫార్సులు లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్ మంజూరైంది. ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచనుగా పింఛన్ అందుకుంటున్నారు.



పొలం వద్దే పింఛన్ అందుకుంటున్న మాళప్ప

టీడీపీ నాయకురాలికి లబ్ధి



మడకశిరరూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు లక్ష్మమ్మ. ఈమెది మడకశిర మండలం క్యాంపురం. టీడీపీకి చెందిన నాయకురాలు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.56,250, అమ్మఒడి కింద రూ.60,000, పింఛన్ రూ.1,0,3000తో పాటు వైఎస్సార్ ఆసరా పథకాలు వచ్చాయి. అలాగే మహిళా సంఘం ద్వారా సున్నా వడ్డీ పథకం ద్వారా కూడా లబ్ధి పొందామని లక్ష్మమ్మ హర్షం వ్యక్తం చేశారు.

'లేపాక్షి'లో మాజీ ఎంపీపీకి..



లేపాక్షి: ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి పేరు ఆనంద్‌కుమార్. లేపాక్షికి చెందిన ఈయన గతంలో ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా పనిచేశారు. ప్రస్తుతం టీడీపీలో కీలక సభ్యుడిగా కొనసాగుతున్నారు. వ్యవసాయం చేసుకుంటూనే టీడీపీలో ఉన్నారు. ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నా కూడా అర్హతే ప్రామాణికంగా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. రైతు భరోసా కింద 2019లో రూ. 9500, 2020లో రూ.13,500, 2021లో రూ.13,500, 2022లో రూ.7,500 లబ్ధిపొందారు. అలాగే పంటల బీమా పథకం కింద రూ.30 వేలు, 2021లో వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.12,250, 2021లో ఆరోగ్యశ్రీ ద్వారా రూ.34,114, సున్నా వడ్డీ ద్వారా రూ.333, అలాగే 2019లో అమ్మఒడి రూ.5 వేలు, 2020లో రూ.4 వేలు, 2022లో రూ.13 వేలు చేకూరింది.

వివక్ష లేకుండా ...



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ప్రకాష్ రెడ్డి. ఈయన హిందూపురం పరిధిలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త. అర్హత ఉండటంతో రెండేళ్లుగా వృద్ధాప్య పింఛన్‌ను పొందుతున్నారు. దాదాపు రూ.52 వేల వరకు లబ్ధిపొందారు.

'పురం'లో టీడీపీ మాజీ కౌన్సిలర్‌కు..



హిందూపురం: చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మహమ్మద్ సనావుల్లా. ఈయన హిందూపురం టీడీపీ మాజీ కౌన్సిలర్. పట్టణంలోని ముక్కిడిపేట ఉంటున్నారు. టీడీపీకి చెందిన వారు అయినా అన్ని అర్హతలూ ఉండటంతో సనావుల్లాకు పింఛన్ మంజూరైంది. జగనన్న ప్రభుత్వంలో ఈయనకు పింఛన్ ద్వారా రూ.78,250 అందింది. అలాగే ఆయన భార్య సబిరాబేగంకు డ్వాక్రా సంఘ సభ్యురాలిగా వైఎస్సార్ చేయూత 75,000, సున్నవడ్డీ కింద రూ.వెయ్యి లబ్ధి చేకూరింది. సన్నావుల్లా కుమారుడు మహమ్మద్ నదీం మూడేళ్లుగా వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్నారు.

సీపీఎం నాయకుడికి అన్ని విధాలా..



మడకశిరరూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు వీరేష్. వీరిది మడకశిర మండలం తురుకువాండ్లపల్లి. ఈయన సీపీఎం నాయకుడు. వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.54,000 లబ్ధి పొందామని వీరేష్ హర్షం వ్యక్తం చేశారు. వలంటీర్ సహకారంతో తన తండ్రి పింఛన్‌కు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకొంటే కొత్త పింఛన్ మంజూరు చేసి అక్టోబర్ నెల నుంచి రూ.2,750 చొప్పున ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారన్నారు. అదే విధంగా ప్రస్తుతం కొత్త రేషన్‌కార్డు కూడా మంజూరు చేశారని.. చాలా సంతోషంగా ఉందన్నారు.

రూ.1,68,500 లబ్ధి



అమరాపురం: చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు వీరక్యాత రాయప్ప. టీడీపీ సానుభూతిపరుడు, వీరిది అమరాపురం మండలం విరుపసముద్రం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ కుటుంబానికి అందుతున్నాయని వీరక్యాతరాయప్ప హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ పింఛన్, వైఎస్సార్ సున్నా వడ్డీ, అమ్మఒడి, రైతు భరోసా వర్తించాయని తెలిపారు. మొత్తం రూ.1,68,500 లబ్ధి పొందామన్నారు.

టీడీపీ నాయకుడిగా ఉన్నా..

పెనుకొండ: అనారోగ్యం బారిన పడి కింద పడుకునే వలంటీర్ ద్వారా పింఛన్ తీసుకుంటున్న ఈయన పేరు అంజినప్ప, వీరిది రొద్దం మండల కేంద్రం. టీడీపీ నాయకుడిగా ఉన్న ఈయనకు టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ అందకపోవడంతో మానసికంగా వేదనకు గురయ్యారు. అయితే జగనన్న ప్రభుత్వం ద్వారా ప్రతి నెలా ప్రస్తుతం రూ.2,750 పింఛన్ అందుతుండటంతో ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



అంజినప్పకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్



టీడీపీ నాయకుడు తిరుమలేష్‌కు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

నూతనంగా పింఛన్ మంజూరు

హిందూపురం: చిలమత్తూరు మండలంలోని దేమకేతపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు గొల్ల సత్యంకు జగనన్న ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. పంచాయతీ ఎన్నికల్లో ఆయన జోరుగా టీడీపీ తరపున జోరుగా ప్రచారం చేశారు. అర్హత ఉండటంతో వివక్షకు తావులేకుండా వలంటీర్ల ద్వారా వృద్ధాప్య పింఛన్ మంజూరైంది.

రైతు సంఘం మండల కమిటీ ఎంపిక

హిందూపురం టౌన్: ఏపీ రైతు సంఘం హిందూపురం మండల కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక కొట్నూరులోని కమ్యూనిటీ హాలులో రైతు సంఘం నాయకులు చలపతి అధ్యక్షతన ఏపీ రైతు సంఘం సమావేశానికి నిర్వహించారు. సమావేశానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్‌రెడ్డి పాల్గొని నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరాములు, తిప్పనతో పాటు ఏడుగురితో కమిటీని ఏర్పాటు చేశారు.

లారీ ఢీ కొని రెండు గొర్రెల మృతి

రొద్దం: మండల పరిధిలోని పాతర్లపల్లి గ్రామం వద్ద పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై సోమవారం గొర్రెల మందను లారీ ఢీ కొంది. ఈ ఘటనలో రెండు గొర్రెలు చనిపోయాయి. పెనుకొండ వైపు నుంచి రొద్దం వైపునకు లారీ వస్తుండగా గొర్రెలను ఢీకొన్నట్లు గ్రామస్తులు చెప్పారు.

ఘర్షణ కేసులో ముద్దాయిలకు రిమాండ్

పెనుకొండ: మండలంలోని మరువపల్లిలో వినాయక చవితి సందర్భంగా జరిగిన కేసులో న్యాయమూర్తి సోమవారం ముద్దాయిలకు రిమాండ్ విధించారు. పోలీసుల వివరాలమేరకు.. మండలంలోని మరువపల్లిలో ఇటీవల వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా వెంకటేష్ అనే వ్యక్తితో శివశంకర్, గణేస్, వెంకటేసులు, లక్ష్మీనారాయణ, తదితరులు ఘర్షణ పడ్డారు. పరస్పరం దాడి చేసుకున్నారు. గాయాలపాలయిన వడ్డే వెంకటేసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.

విష జ్వరంతో వ్యక్తి మృతి



రామచంద్ర (ఫైల్)

మడకశిరరూరల్: మండల పరిధిలోని క్యాంపురం గ్రామానికి చెందిన రామచంద్ర (37) విషజ్వరంతో బాధపడుతూ హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



అమరాపురంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు



లేపాక్షి : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య పరీక్షలకు హాజరైన ప్రజలు



రొద్దం: ఎం కొత్తపల్లిలో స్టాల్స్ పరిశీలిస్తున్న అధికారులు

అమరాపురం/పెనుకొండ రూరల్/రొద్దం/మడకశిరరూరల్/లేపాక్షి: రాష్ట్రంలోని ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమం పేదలకు వరమన్నారు. సోమవారం అమరాపురంలోని స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం, పెనుకొండ మండలంలోని నాగలూరు, రొద్దం మండల పరిధిలోని ఎం కొత్తపల్లి, లేపాక్షి మండలంలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మడకశిర మండల పరిధిలోని గోవిందాపురం ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలకు వైద్యులు వైద్య సేవలు అందజేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఎన్‌సీసీ క్యాంప్‌లో విద్యార్థి ప్రతిభ

హిందూపురం టౌన్: దేశ రాజధాని ఢిల్లీలో ప్రతిష్టాత్మకమైన ఆలిండియా తల్ సైనిక్ ఎన్‌సీసీ క్యాంపులో హిందూపురం పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలకు చెందిన విద్యార్థిని బి.మేఘన ఉత్తమ ప్రతిభ కనబరచింది. సోమవారం స్థానిక కళాశాలలో మేఘనను కళాశాల కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్, తోటి విద్యార్థులు అభినందించారు. కళాశాల కార్యదర్శి బైసాని రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎస్‌డీజీఎస్ కళాశాలలో బీబీఏ రెండో సంవత్సరం చదువుతున్న బి.మేఘన మిలట్రీ ట్రైనింగ్‌ను తలపించే అతి క్లిష్టమైన ఆప్టికల్ ట్రైనింగ్, టెంట్ పిట్చింగ్‌లో అన్ని రాష్ట్రాల ఎన్‌సీసీ క్యాడెట్‌లను వెనుక్కు నెట్టి ఓవర్ ఆల్ చాంపియన్ షిప్‌లో రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడం హర్షణీయమన్నారు. కళాశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ దాసా సురేష్, నందకిశోర్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర కుమార్, అశ్వర్థ నారాయణ, ఎన్‌సీసీ ఆఫీసర్ ఫణీంద్ర, పీడీ హేమంత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాజన్న పాల్గొన్నారు.



విద్యార్థిని మేఘనను సన్మానిస్తున్న దృశ్యం

గుర్తు తెలియని వ్యక్తి మృతి



హిందూపురం అర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అడుక్కుంటూ జీవనం సాగించే గుర్తు తెలియని వ్యక్తి (50) కల్లూరు సుబ్బరావు పార్కు వద్ద సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ హరూన్ బాషా తెలపారు. అతన్ని ఎవరైనా గుర్తిస్తే వన్ టౌన్ సీఐ, ఎస్‌ఐలకు సమాచారం ఇవ్వాలన్నారు.

దాతల సహకారం మరువలేం

అమరాపురం: దాతల సహకారంతో మండలంలోని ఉదుగూరులో ఆర్డీటీ నిర్మించిన కమ్యూనిటీ భవనం, పాఠశాల అదనపు గదిని సోమవారం జర్మన్‌వాసి, దాత బెంజమెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. బెంజమెన్ రూ.14,28,000 ఇవ్వడంతో అదనపు గది, కమ్యూనిటీ భవనాన్ని నిర్మించామన్నారు.



విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక.



పనులు నాణ్యతగా చేయండి

హిందూపురం: ముద్దిరెడ్డిపల్లి 35వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. సోమవారం వార్డు కౌన్సిలర్ జయరాములుతో కలిసి రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఏఈ నరేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే పంట నూర్పిడి



రహదారిపై మొక్క జొన్న పంట ఆరబోసిన దృశ్యం

పెనుకొండ రూరల్: రహదారులపైనే కొందరు రైతులు పంట నూర్పిడి పనులు చేపట్టడంతో ఎప్పుడు ఏ రోడ్డు ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. మండలంలోని దుద్దేబండ గ్రామం నుంచి గొల్లపల్లి వరకు రహదారిలోని ఒక వైపు పంట నూర్పిడి చేస్తున్నారు. అలాగే పంట ఆరబోత పనులు చేపట్టారు. నిత్యం గొల్లపల్లికి పర్యాటకులు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్లపైనే పంట నూర్పిడి, పంట ఆరబోత వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బైజూస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

హిందూపురం టౌన్: ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఐఎఫ్‌బీ, బైజూస్‌ను అమలు చేయాలని ఎంఈఓ-1, కోర్సు డైరెక్టర్ గంగప్ప సూచించారు. సోమవారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఐఎఫ్‌బీ టీవీ, బైజూస్‌పై ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ప్రసన్న లక్ష్మీ, ఎంజీఎం హెచ్‌ఎం సామ్రాజ్యం, రీసోర్స్ పర్సన్లు రంగదామరెడ్డి, రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: విద్యార్థులు సంకేతిక పరిజ్ఞానంతో విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఎఫ్‌పీ (ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానెల్) బైజూస్ ద్వారా పిల్లలకు విద్యను బోధించడం కోసం ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులకు ప్రారంభించారు. ఇందులో భాగంగానే సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎంఈఓ-2 శ్రీధర్ ఆధ్వర్యంలో ఐఎఫ్‌బీ టీవీ, బైజూస్‌పై మొదటిరోజు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతులకు వినోద్‌కుమార్, అనిల్, అపర్ణ, శ్రీదేవిలు ఆర్పీలుగా వ్యవహరించారు.

మడకశిర: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సోమవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఐఎఫ్‌బీ టీవీ, బైజూస్‌పై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎంఈఓలు, భాస్కర్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బైజూస్ యాప్‌పై శిక్షణ ఇచ్చినట్లు ఎంఈఓ రవిచంద్రకుమార్ తెలిపారు. బుధ, గురువారాల్లో మిగతా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.



హిందూపురం: మాట్లాడుతున్న ఎంఈఓ-1, కోర్సు డైరెక్టర్ గంగప్ప

వైభవంగా వినాయక నిమజ్జనం



హిందూ మహా గణపతిని ఊరేగిస్తున్న దృశ్యం, టెంకాయలు కొడుతున్న యువకులు

పావగడ: స్థానిక విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ మహా గణపతి నిమజ్జనం వైభవంగా జరిగింది. అశ్వర్థం కట్ట వద్ద 21 రోజులుగా క్రితం ఏర్పాటు చేసిన గణపతిని సోమవారం మధుగిరి రోడ్డులో సాయిబాబా ఆలయం వద్ద ఉన్న చాకలికుంటలో నిమజ్జనం చేశారు.